క్లుప్తంగా

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే తిప్పేస్వామి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: అనంతపురంలో శనివారం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎమ్మెల్యే తిప్పేస్వామి కలిశారు. మడకశిర ప్రాంతంలో పూర్తి స్థాయిలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించడానికి విరివిగా విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరగా ప్రతిపాదనలు పంపాలని మంత్రి సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర మంత్రి ఉషాశ్రీచరణ్‌ను కూడా ఎమ్మెల్యే కలిశారు. ఐసీడీఎస్ కార్యాలయానికి నూతన భవనాన్ని నిర్మించాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన నటుడు శివరాజ్‌కుమార్



ఎమ్మెల్యేతో కన్నడ హీరో శివరాజ్‌కుమార్

పెనుకొండ: కన్నడ సినీ నటుడు శివరాజ్‌కుమార్ శనివారం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రొద్దం మండలం బొక్సంపల్లి వద్ద కన్నడ సినిమా షూటింగ్ జరుగుతోంది. షూటింగ్‌లో పాల్గొనడానికి విచ్చేసిన శివరాజ్‌కుమార్ సర్పంచ్ గుర్రం విశ్వనాథరెడ్డితో కలసి ఎమ్మెల్యేను కలిశారు. జెడ్పీటీసీ శ్రీరాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ సునీల్, ఎంపీపీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 రవిచంద్రకుమార్

గుడిబండ: శంకరగల్లు, రాళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలు, రాళ్లపల్లి ఉన్నత పాఠశాలలను ఎంఈఓ-2 రవిచంద్రకుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను, విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను బోధించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. రెండవ దశ నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

అమరాపురం: మండలంలోని బసవనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీఓ మునిస్వామి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఆరా తీశారు. భోజన నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. కోడిగుడ్లు, చిక్కీలు ఇస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హులుకూరు సమీపంలోని కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు.

రొళ్ల: రంగనపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 శ్రీధర్ శనివారం సందర్శించారు. ఎండీఎం నిర్వాహకులు తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు.

పంటలపై అడవి పందుల దాడి



ధ్వంసమైన మొక్కజొన్న పంట

చిలమత్తూరు: మండలంలోని పాతచామలపల్లి పొలాల్లో అడవి పందుల బెడద తీవ్రంగా మారింది. శుక్రవారం రాత్రి అడవి పందులు రైతు వేణుగోపాల్‌కు చెందిన రెండు ఎకరాల మొక్కజొన్న పొలంలోకి చొరబడి మొక్కలను పెకలించి వేశాయి. పంట చేతికందే సమయంలో పందులు ధ్వంసం చేయడంతో రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అటవీశాఖ అధికారులు స్పందించి అడవి పందుల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి హామీ

రొళ్ల: మండలంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే తిప్పేస్వామితో కలిసి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి దృష్టికి తీసుకువెళ్లినట్లు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. స్పందించిన రాష్ట్ర మంత్రి త్వరలోనే సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర, సింగిల్ విండో అధ్యక్షుడు మోతిరాంనాయక్, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు సంతోష్, ఎస్సీ సెల్ కన్వీనర్ ఆంజినేయులు పాల్గొన్నారు.

పథకాలతో ప్రజల కళ్లల్లో సంతోషం

- ఎమ్మెల్యే శంకరనారాయణ



సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ రూరల్: సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల కష్టాలు తీర్చుతున్నది సీఎం జగనన్నే అని, రానున్న ఎన్నికల్లో ప్రజలు మరోమారు వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పట్టనున్నారని ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. మండల పరిధిలోని మావటూరు, సుద్దబట్లపల్లి గ్రామాల్లో శనివారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. పింఛన్లు, జగనన్న పక్కా గృహాలు మంజూరు చేయాలని పలువురు కోరారు. డ్రైనేజీలు నిర్మించాలని విన్నవించారు. సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను అధికారుల దృష్టికి తేవాలని వలంటీర్లకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేసి పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందజేస్తున్నారన్నారు. పథకాలు అందుకుంటున్న ప్రజల కళ్లలో సంతోషాన్ని చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్‌సీపీకి అత్యధిక స్థానాలు వస్తాయనే నమ్మకం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గీత, జెడ్పీటీసీ శ్రీరాములు, ఎంపీడీవో శివశంకరప్ప, సర్పంచ్ నాగరాజు, సగర కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాబు, వైశాలి జయశంకరరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి, కొండలరాయుడు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, రాజశేఖర్ పాల్గొన్నారు.

చంద్రబాబు డైరెక్షన్‌లోనే దాడులు

- ఎమ్మెల్యే తిప్పేస్వామి



ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: చిత్తూరు జిల్లా పుంగనూరు ఘటనలో ప్రధాన ముద్దాయి చంద్రబాబేనని ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆరోపించారు. చంద్రబాబుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన శనివారం సాక్షితో మాట్లాడుతూ పథకం ప్రకారమే పోలీసులపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారని ఆరోపించారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఈ ఘటన జరిగిందన్నారు. చంద్రబాబు రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యలను సృష్టించడానికి కుట్ర పన్నారని ఆరోపించారు. రాష్ట్రంలో చంద్రబాబును ఇలాగే తిరగనిస్తే రాష్ట్రం రావణ కాష్టంగా మారడం ఖాయమన్నారు. చంద్రబాబు పర్యటనలకు పోలీసులు అనుమతి ఇవ్వకూడదన్నారు. వైఎస్ జగన్‌పై పెరుగుతున్న జనాదరణను ఓర్వలేకనే చంద్రబాబు ఇలాంటి అల్లర్లను సృష్టిస్తున్నారని తెలిపారు. వైఎస్ జగన్ ప్రభుత్వానికి ఈ విధంగానైనా చెడ్డ పేరు తేవాలని చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారని విమర్శించారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గించాలనే అల్లర్లు

హిందూపురం: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పించాలనే దురుద్దేశంతో చంద్రబాబు అల్లర్లకు పన్నాగాలు పన్నుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి విమర్శించారు. కావాలనే రూట్ మార్చుకుని చంద్రబాబు నాయుడు టీడీపీ నాయకులను రెచ్చకొట్టి గూండాలతో అల్లర్లకు పాల్పడ్డారన్నారు. టీడీపీ గూండాల దాడిలో 27మంది పోలీసులు, 50మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గాయపడ్డారన్నారు. ఓటమి భయంతో నీచరాజకీయాలకు పాల్పడుతున్న చంద్రబాబు, టీడీపీకి ప్రజలు సరైన బుద్ధి చెబుతారని చెప్పారు.

రైతులకు అన్ని ప్రయోజనాలు దక్కేలా కృషి

- ప్రమాణస్వీకారోత్సవంలో సింగిల్‌విండో అధ్యక్షుడు సూర్యప్రకాష్‌రెడ్డి



ప్రమాణ స్వీకారం చేస్తున్న సూర్య ప్రకాష్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: ఇస్లాపురం సింగిల్‌విండో అధ్యక్షునిగా గొల్లపల్లి సూర్యప్రకాష్‌రెడ్డి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక ఏడీసీసీ బ్యాంక్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకరనారాయణ, జెడ్పీటీసీ శ్రీరాములు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఇతర ముఖ్య నాయకులు హాజరయ్యారు. సింగిల్‌విండో సెక్రటరీ హరి సూర్యప్రకాష్‌రెడ్డితో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే తనపై నమ్మకం ఉంచి అప్పగించిన ఈ పదవికి న్యాయం చేస్తానన్నారు. సింగిల్‌విండో ద్వారా రైతులకు అన్ని ప్రయోజనాలను దక్కేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సమస్యలపై దృష్టి నిలిపి రైతుల రుణపరపతిని పెంచాలని, ప్రధానంగా జగనన్నకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఏడీసీసీ బ్యాంక్, సింగిల్‌విండో అధికారులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాగలూరుబాబు, వైస్ చైర్మన్ సునీల్, రామ్మోహన్‌రెడ్డి, జయశంకరరెడ్డి, వెంకటరత్నం, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఎమ్మెల్యే చొరవతో సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

పరిగి: మండల కేంద్రంలో ఉర్దూ పాఠశాల సమీపంలో కాపు తిప్పారెడ్డి వీధిలో రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు తొలిగాయి. దాదాపు 30 ఏళ్లగా రోడ్డు సౌకర్యం లేక ఆప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఇటీవల ఈ ప్రాంతంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులు రోడ్డు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రోడు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీపీ సవిత, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, ఎంపీటీసీలు చంద్రారెడ్డి, లింగమ్మ, వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ జయరాం ఆధ్వర్యంలో శనివారం ఉదయం సీసీ రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించి, సాయంత్రానికి పూర్తి చేయించారు. సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల్లో గెలవలేమనే టీడీపీ అరాచకాలు

- కిరాయి రౌడీలు, గూండాలతో దౌర్జన్యాలు, అల్లర్లు, దాడులు
- రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చి లబ్ధి పొందాలని చంద్రబాబు ఎత్తులు
- మండిపడ్డ వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- పుంగనూరులో టీడీపీ శ్రేణుల దుశ్చర్యపై పురంలో వైఎస్సార్‌సీపీ నిరసన ర్యాలీ



అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టిఎన్.దీపిక, నాయకులు

హిందూపురం: జగనన్న సుభిక్షపాలన, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక చంద్రబాబు నీచ కుటిల రాజకీయాలకు తెరలేపారని వైఎస్సార్‌సీపీ హిందూపురం సమన్వయకర్త కురబ దీపిక విమర్శించారు. పుంగనూరులో టీడీపీ నాయకులు పాల్పడిన దాడులు, అల్లర్లను ఖండిస్తూ టీఎన్.దీపిక ఆధ్వర్యంలో శనివారం హిందూపురంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉద్యమించారు. భారీ ర్యాలీగా అంబేడ్కర్ సర్కిల్ వద్దకు చేరుకొని టీడీపీ తీరుపై నిరసన తెలిపిన అనంతరం ర్యాలీగా ప్రెస్‌క్లబ్ వద్దకు చేరుకున్నారు. సమన్వయకర్తతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్ల రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి తన నాలుగేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో గెలవడం కష్టమేనని అర్థం చేసుకున్న చంద్రబాబు.. అభద్రతభావంతో శకుని రాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రాజెక్టుల పరిశీలన ముసుగులో జగనన్న పాలనపై విమర్శలు చేయడానికి పన్నాగాలు చేస్తున్నారని మండిపడ్డారు. ముందస్తు ప్రణాళికలతో టీడీపీ యాత్రల్లో రౌడీలను తెప్పించుకొని రెచ్చగొట్టి పోలీసులపై దాడులు చేయించి దానిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఆపాదించాలని కుటిల ఆలోచనలకు తెరలేపుతున్నారని విమర్శించారు. అల్లర్లు, ఘాతుకాలతో రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పించి లబ్ధి పొందాలని పన్నాగం పన్నారన్నారు. టీడీపీ పాలనలో అమరావతి, పోలవరం ప్రాజెక్టు పేరుతో చేసిన దోపిడీ అంతా ఇంతా కాదని విమర్శించారు. పుంగనూరు ఘటన అరాచకాలకు బాధ్యుడైన చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

కుయుక్తులు, కుటిల బుద్ధితో అధికారంలో రాలేరు:

కుటిల బుద్ధితో చంద్రబాబు ఎన్నడూ అధికారంలోకి రాలేరని మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక చంద్రబాబు తన యాత్రలో గూండాలను వెంటపెట్టుకుని అరాచకాలు సృష్టిస్తూ 2024 ఎన్నికల్లో లబ్ధి పొందాలని ఎత్తులు వేస్తున్నారని విమర్శించారు. రాయలసీమలోని ప్రాజెక్టులపై అసత్యాలు ప్రచారం చేస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో బాబుకు సరైన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి మాట్లాడుతూ రక్షణ కల్పించడానికి వచ్చిన పోలీసులపై చంద్రబాబు రాళ్లు, రాడ్లతో దాడులు చేయించారని, దీన్నిబట్టి చంద్రబాబు ఫ్రస్టేషన్ ఏస్థాయిలో ఉందో అర్థమవుతోందన్నారు. టీడీపీని భూస్థాపితం చేసే రోజులు దగ్గరపడ్డాయన్నారు. సమావేశంలో ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, వైస్‌చైర్మన్ జబీవుల్లా, డైరెక్టర్లు నాగమణి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రేపటి నుంచి డిగ్రీ తరగతులు

హిందూపురం టౌన్: స్థానిక ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యాసంవత్సరం డిగ్రీ ప్రథమ సంవత్సరం తరగతులను సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రగతి శనివారం తెలిపారు. ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందిన బీఏ, బీ.కామ్, బీఎస్సీ విద్యార్థినులు సోమవారం కళాశాలకు వచ్చి అడ్మిషన్లను నిర్ధారించుకోవాలన్నారు.

బీజేపీతోనే మైనార్టీల సంక్షేమం

హిందూపురం టౌన్: బీజేపీతోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో మైనార్టీల అభివృద్ధి శూన్యమని, వారి ఆర్థిక పరమైన అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమైందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వంలో దేశ వ్యాప్తంగా మైనార్టీలకు జరుగుతున్న మంచిని వివరిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటన చేపట్టామన్నారు. మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సాధిక్, ముంతాజ్, పార్థసారధి పాల్గొన్నారు.

త్వరలో దళిత రక్షణ యాత్ర

పెనుకొండ: త్వరలో రాష్ట్రవ్యాప్తంగా దళిత రక్షణ యాత్ర కార్యక్రమాన్ని చేపడుతామని కులవివక్ష పోరాట సంఘం నాయకులు గంగాధర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం దళిత సంఘాల నాయకులు సమావేశమయ్యారు. గంగాధర్ మాట్లాడుతూ దళిత మహిళలపై అనేక రూపాల్లో దాడులు జరుగుతున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే దీనికి కారణమన్నారు. దళితుల రక్షణకు చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో ఈ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

అగళి: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా హళికెరలో సర్పంచ్ ముద్దరాజు ఆధ్వర్యంలో శనివారం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆప్తాల్మిక్ డాక్టర్ అనిల్, డాక్టర్ శివానంద వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు.

పీహెచ్‌డీ ప్రదానం

పావగడ: తాలూకాలోని ఆంధ్ర సరిహద్దు లోని టీఎన్ పేటి గ్రామానికి చెందిన ఆర్ లక్ష్మీశ్‌కు బెంగళూరులోని వ్యవసాయ విశ్వ విద్యాలయం(జీకేవీకే) పీహెచ్‌డీ పట్టా అందించింది. ఫెనో టైపిక్ ఎవాల్యుయేషన్ ఆఫ్ హై ప్రొటీన్(రిల్స్) ఆఫ్ రైస్ (ఒరియాజా సాటివా ఎల్) అనే అంశంపై డాక్టర్ కేఎం హరిణి కుమార్ పర్యవేక్షణలో రూపొందించిన పరిశోధన గ్రంథానికి పీహెచ్‌డీ అందజేశారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ చేతుల మీదుగా పట్టా అందుకున్నారు.

సన్మానం

పరిగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించి, బదిలీపై వెళ్లిన ఫిజికల్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డిని శనివారం స్థానిక పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు సత్యకృపరాజు, నార్త్ ఫుట్‌బాల్ క్లబ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

పావగడ: వెంకటాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మానం శశి కిరణ్ శనివారం తెలిపారు. బెంగళూరుకు చెందిన ఆకాశ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్య నిపుణులు పాల్గొని చికిత్సలు అందజేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్

పావగడ: నూతన తహసీల్దార్ వరదరాజు శనివారం స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీవీ వెంకటేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా తాలూకా సమగ్ర అభివృద్ధికి సంబంధించి ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు.

మధుగిరి రోడ్డు పనులు పూర్తి చేయండి

మడకశిర: అనంతపురంలో శనివారం జాతీయ రహదారుల ఎస్ఈ మురళీమోహన్‌ను ఎమ్మెల్యే తిప్పేస్వామి కలిశారు. ఈ సందర్భంగా పట్టణంలోని మధుగిరి రోడ్డు పనులను పూర్తి చేయాలని ఎస్ఈని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రూ.60లక్షల నిధుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఎస్ఈ తెలియజేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

బీఎల్‌ఓలకు శిక్షణ

గోరంట్ల: ఓటరు నమోదు, ఇంటింటా సర్వేపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు శనివారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. తహసీల్దార్ రంగనాయకులు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికీ ఓటు హక్కు కల్పించాలని, ప్రతి ఇంటికీ తిరిగి ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలన్నారు.

రైలు ఢీకొని గొర్రెల మృతి

పెనుకొండ రూరల్: రైలు ఢీకొని గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలోని రాంపురం వద్ద శనివారం జరిగింది. గ్రామానికి చెందిన ఓ కాపరి తన గొర్రెలను మేత కోసం తీసుకెళ్తూ పట్టాలు దాటిస్తుండగా రైలు ఢీకొంది. దీంతో మూడు గొర్రెలు మృతి చెందాయి.

చిలమత్తూరు ఎంఈఓకు సన్మానం

లేపాక్షి: లేపాక్షిలోని వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ పదోన్నతిపై చిలమత్తూరు ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన సాల్మాన్‌రాజ్‌ను శనివారం సాయంత్రం ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఎంఈఓలు మాట్లాడుతూ తన విధి నిర్వహణలో క్రమశిక్షణతో పనిచేసి టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు రావడానికి కృషి చేశారన్నారు.

8న ప్రజావేదిక

సోమందేపల్లి: ఉపాధి హామీ పథకంలో భాగంగా 2022-23 ఏడాదికి సంబంధించి జరిగిన పనులపై చేపట్టిన సామాజిక తనిఖీకి సంబంధించి ఈనెల 8న ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



సిబ్బందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పరిగి: విద్యార్థుల ఆరోగ్యాల పరిరక్షణే ధ్యేయంగా 1నుంచి 19 సంవత్సరాల వయసున్న వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని ఎంపీడీఓ సరస్వతి సూచించారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూపరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నులిపురుగుల నివారణ, ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై చర్చించారు. ఈనెల 7 నుంచి 12 వరకూ నులిపురుగుల నివారణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14500 ఆల్బెండజోల్ మాత్రలు అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహం, ఎంఈఓ-2 శేషాచలం, ఊటుకూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు సురేష్‌కుమార్, రూబి, సీహెచ్‌ఓ వన్నప్ప, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో పిల్లలకు ఆరోగ్యం

గుడిబండ: నులిపురుగుల నివారణలో భాగంగా ఈనెల 10వ తేదీన ప్రతి పాఠశాలలో ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని ఎంపీపీ రాధమ్మ, ఎంపీడీఓ రామారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందితో శనివారం వారు సమావేశం నిర్వహించారు. 1-19 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. అనంతరం మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు సౌందర్య, భారతి, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

రొద్దం: జాతీయ నులిపురుగుల దినోత్సవంపై శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ జగదీశ్‌బాబు అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ మాట్లాడుతూ ఈ నెల 10న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ శాంతలక్ష్మి, ఎంపీహెచ్‌ఈఓ విజయలక్ష్మి, ఎంఈఓ జయభాస్కర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సుజాత, అనురాధ పాల్గొన్నారు.

ఓటరు జాబితా సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ జమానుల్లాఖాన్

అగళి: మండల పరిధిలోని ఎంఎం పాళ్యం గ్రామంలో జరుగుతున్న ఓటర్ల జాబితా సర్వేను తహసీల్దార్ జమానుల్లాఖాన్ శనివారం పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల పేర్లు సరిచూడాలన్నారు. తప్పులు ఉంటే సరిదిద్దాలని, కొత్త ఓటర్లను జాబితాలో చేర్చాలని బీఎల్‌ఓలకు సూచించారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

మడకశిరరూరల్: తప్పులు లేకుండా పారదర్శకంగా ఓటరు జాబితాను సిద్ధం చేయిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ బాలాంజినేయులు తెలిపారు. గొడనహళ్లి, తురుకువాండ్లపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటా ఓటరు సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. కొత్త ఓటరు నమోదుకు ఫారం-6 , ఎక్కడైనా డబుల్‌నమోదు ఉంటే వాటిని ఫారం-07తో తొలగించాలని బీఎల్‌ఓలకు సూచించారు.

హిందూపురం: హిందూపురం నియోజకవర్గంలోని అన్ని మండల్లో ఇంటింటికీ వెళ్లి హౌస్ టు హౌస్ ఓటరు సర్వే వేగవంతం చేయాలని ఏఈఆర్‌ఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ రు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బీఎల్‌ఓ, రెవెన్యూ అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఓటరు సర్వే వేగవంతంగా, పక్కడ్బందీగా సాగాలన్నారు. షెల్టర్‌లెస్, ట్రాన్స్‌జెండర్, వికలాంగులను కూడా గుర్తించి వారికి ఓటు హక్కు కల్పించాల చూడాలన్నారు. ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, ఆపరేటర్ బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ



హ్యాండ్ బ్యాగ్‌ను సొంతదారులకు అప్పగిస్తున్న ఆటో డ్రైవర్ మహబూబ్‌బాషా

హిందూపురం అర్బన్: ప్రయాణికురాలు మరచిపోయిన హ్యాండ్ బ్యాగ్ సొంతదారుకు అప్పగించి ఆటో డ్రైవర్ మహబూబ్‌బాషా నిజాయితీ చాటారు. పట్టణంలోని బస్టాండ్ నుంచి శనివారం నలుగురు ప్రయాణికులు రైల్వే స్టేషన్‌కు ఆటోలో వెళ్లారు. దిగే సమయంలో హ్యాండ్ బ్యాగ్ మరచిపోయారు. గమనించిన ఆటో డ్రైవర్ ఆ బ్యాగ్‌ను తెరచి చూడగా రూ.10 వేల నగదు, సెల్‌ఫోన్ కనిపించింది. వెంటనే సొంతదారులను గుర్తించి బ్యాగ్‌ను అందజేశారు.

టేక్ హోం రేషన్‌లో అశ్రద్ధ వద్దు



అవగాహన కల్పిస్తున్న స్టేట్ మానిటరింగ్ అధికారిణి సింహాచలం

చిలమత్తూరు: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు అందజేస్తున్న టేక్ హోం రేషన్ విషయంలో అశ్రద్ధ వహించవద్దని స్టేట్ మానిటరింగ్ అధికారిణి సింహాచలం అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. చిలమత్తూరులో మెర్జ్‌డ్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పీడీ లక్ష్మికుమారితో కలిసి శనివారం తనిఖీ చేశారు. టేక్ హోం రేషన్ పంపిణీపై ఆరా తీశారు. అనంతరం మొబైల్‌లో టీహెచ్‌ఆర్ సంబంధించి గర్భిణులు, బాలింతలు, 0-6 వయస్సులోపు చిన్నారుల వివరాలు రిజిస్ట్రేషన్ ఎలా చేయాలనే విషయాలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ రెడ్డిరమణమ్మ, సూపర్‌వైజర్ లలితమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

అమరాపురం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు క్రిష్టారెడ్డి, సర్పంచ్ భాగ్యమ్మ పేర్కొన్నారు. హనుమంతనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషణ కిట్లు అందజేశారు.

గోరంట్ల: తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా కళ్లగేరి గ్రామంలో ఐసీడీఎస్, వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంట వ్యవధిలోనే తల్లి పాలు అందించాలన్నారు.

రొళ్ల: టీడీ పల్లి, హొట్టేబెట్ట, కొత్తపాళ్యం, కల్లురొప్పం, మల్లినమడుగు, జీరిగేపల్లి, కాల్వేపల్లి, హెచ్‌టీ హళ్లితో పాటు బీజీ హళ్లి అంగనవాడి కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ సందర్శించి తగు సూచనలు చేశారు.

కత్తెర పురుగును నివారించుకోండి

గుడిబండ: రాళ్లపల్లి గ్రామంలో సాగుచేసిన మొక్కజొన్న, రాగి పంటలను శనివారం వ్యవసాయ అధికారి తిమ్మప్ప పరిశీలించారు. మొక్కజొన్నను కత్తెర పురుగు ఆశించిందని, దీనిని నివారించడానికి ఇమామెక్టిన్ బెంజోయేట్‌ను ఒక ఎకరాకు 100 గ్రాములు, లేదా ఒక లీటర్ నీటికి 0.3 గ్రాములు పిచికారీ చేయాలన్నారు. రాగి పంటకు అగ్గి తెగులు, మెడవిరుపు సోకకుండా ట్రైసైక్లాజోల్ 0.6 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.